కథ

# నాన్నా! నన్ను...క్షమించండి!!

ఎం. వెంకటేశ్వరరావు



నాన్నా!

నన్ను క్షమించండి. ఇన్నేళ్లు ఇంటినే అంటి పెట్టుకునున్న నాకు మీకిలా ఉత్తరం రాసే అవసరం ఏర్పడలేదు. చేతికున్న అన్ని వేళ్లూ సమంగా లేనట్టే, మీ సంతానంలో చివరివాడినయిన నాకు చదువులో అటు అన్నయ్యకున్న చురుకుదనం, ఇటు అక్కయ్య ఆసక్తి అలవడలేదు.

కాలం కంప్యూటర్ల పేరిట, చదువులు ఎంసిపి,ఎంబిపి,ఇంజనీరింగ్, మెడిసిన్‌ల వెంట ఉద్యోగాలు సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్లంటూ యుఎస్, యుకెల వెంట పరుగులు తీస్తున్న ఈ రోజుల్లో ఇంజనీరింగ్‌లో ఉన్న అన్నయ్యకి, మెడికో సోదరికి తమ్ముడై వుండి, పదో తరగతి అత్తెసరు మార్కులతో గట్టెక్కిన నన్ను ఇంజనీర్ని చేయాలని కార్పొరేట్ కాలేజీలో ఇంటర్లో చేర్పించారు. నా మీద సంవత్సరానికి పాతికవేలు వెచ్చించడం మధ్యతరగతి ఉద్యోగిగా మీకు శక్తికి మించిన పనే... అయినా...

నాపై వాళ్లిద్దరూ వేర్వేరు ఊళ్లు చదువుల కోసం వెళ్లడం వలన కాబోలు మీతో నాకు ఎక్కువ సాన్నిహిత్యం. అన్యాక్రాంతంగా వచ్చే దేన్నయినా ఆశించని మీ నైజం, నిజాన్ని నిర్భయంగా వెల్లడించే మీ ధైర్యం నన్ను ఎక్కువగా ప్రభావితం చేశాయి. అయినా ఏం లాభం? చదువులో మీరూహించిన ఎత్తులకు ఎదగలేక పోయాననే అసంతృప్తి మీరు వ్యక్తం చేస్తుండడంతో, నిజంగానే జీవితంలో ఏదీ సాధించలేనేమోననే నిర్వీర్యం నాలో స్లో పాయిజన్‌లా ప్రవేశించసాగింది. డిగ్రీ కూడా బొటాబొటీ మార్కుల్తోనే పాసయి పై చదువులకి వెళ్లలేక, ఉద్యోగపు పరుగు పందెంలోనూ ఓడిపోయిన గుర్రంలానే మిగిలిపోయాను. ప్రతి రోజూ అమ్మ కూడా ఏదో ఒక సమయంలో నాపై వాళ్లిద్దరితో నన్ను పోలుస్తూ, 'ఎందుకు పనికిరాని వాడినని' అక్షింతలు వెయ్యడం నన్ను మరీ క్రుంగదీస్తోంది.

అన్నయ్యకి చెన్నయ్‌లో జాబ్ రావడం, పెళ్లి జరగడం, అక్కయ్య మెడిసిన్ పూర్తి చేసి పీజీలో చేరడం ఇటీవల మన ఇంట్లో ఏర్పడ్డ మార్పులు. ఏ మార్పులు లేనిది నా జీవితంలోనే.


ఎందుకో ఈ మధ్య మన ఇద్దరి మధ్య ఉన్న చనువు సన్నగిల్లుతున్నట్టనిపిస్తోంది. తప్పదన్నట్లు మీరు మాట్లాడే తడిపొడి మాటలు నాలో అసహనపు శాతాన్ని, అధికం చేస్తున్నట్లనిపిస్తోంది. మీకు నేను, నా ఉద్యోగం సమస్యగా మారాయని, అన్నం తింటున్నప్పుడు కూడా అమ్మ అనే సూటిపోటి మాటల ఆంతర్యాన్ని అర్థం చేసుకోగలను. ఎవరేమన్నా నోరు విప్పలేదు. అది నా అసమర్థత.

బ్యాంకు రిక్రూట్‌మెంట్ పరీక్షలకి ప్రకటన చూసి అప్లయ్ చేశాను. ఎప్పటిలా కాకుండా ఈసారి తప్పక పాసవ్వాలన్న పట్టుదలతో దీక్షగా చదవసాగాను.

మూడ్నెల్ల తరువాత రేపు బ్యాంకు పరీక్ష అనగా, ఇంట్లో కూర్చుని పుస్తకాలతో కుస్తీ పడుతున్న నా దగ్గరికి మీ కొలీగ్ భాస్కర్రావంకుల్ వచ్చి...

'సూర్యం! రేపు నువ్వు రాయబోతున్న పరీక్షకి ఇది ఇంపార్టెంట్ క్వశ్చన్సున్న మోడల్ పేపరు. ఆల్మోస్ట్ ఈ విధంగానే వుంటుంది. వీటిని బాగా ప్రిపేరవ్వు' అని కొన్ని పేపర్లు ఇచ్చి వెళ్లారు. నేను ఆ రాత్రంతా వాటినే బాగా చదివి మర్నాడు పరీక్షకెళ్లాను.


'ఆశ్చర్యం' పరీక్షలో వచ్చిన ప్రశ్నలన్నీ భాస్కర్రావంకుల్ ఇచ్చినవే. జవాబులన్నీ తెలిసినవే. పేపరు ముందే లీకయిందేమో అనే అనుమానం. కలం ముందుకు కదలడానికి మొరాయిస్తోంది. ఇప్పటికి చాలా సార్లు కాంపిటీటివ్ ఎగ్జామ్స్ రాసాను. ఏ ప్రశ్నలొస్తాయో తెలియకుండా అన్నీ చదువుకొని రెండుగంటల పరీక్షా సమయంలో ఇచ్చిన ప్రశ్నలకి తెలిసిన జవాబులు రాయడంలో ఉన్న తృప్తి, ఇప్పుడు లీకయిన పేపరు చూడడంతో నాలో ఏదో అసంతృప్తి. ఆత్మవంచనగా అనిపిస్తోంది. చుట్టూ వున్న వాళ్లని చూశాను. నేను తప్ప అందరూ కలాలతో యుద్ధంలో పోరు సల్పుతున్న యోధుల్లా కనిపించారు. మళ్లీ పేపర్ మీదికి దృష్టి మరల్చాను. ఎందుకో మనస్సాక్షి ఎదురు తిరుగుతోంది. భాస్కర్రావంకుల్ ఇచ్చిన వైకుంఠపాళీ నిచ్చెన వాస్తవానికి విరుద్ధంగా ఎక్కడానికి మనస్సంగీకరించడం లేదు. కళ్ల ముందు మీరే కనిపిస్తున్నారు. మీ నిజాయితీకి నిదర్శనంగా, మీ ఉద్యోగ జీవితంలో ఎదురైన ఎన్నో అవరోధాలు ఎలా అధిగమించి ఆదర్శంగా ఉన్నదీ... మీరు చెప్పిన మాటలు చెవుల్లో మార్మోగుతున్నట్లనిపించసాగింది.



మనస్సంతలోనే వాస్తవం వైపు తొంగి చూసింది. అందొచ్చిన అవకాశాన్ని చేజేతులా వదులుకుంటున్నట్లు అనిపిస్తోంది. ప్రస్తుతం అన్ని ప్రభుత్వ సంస్థల్లో రిక్రూట్‌మెంట్లు నిలిపేసి, ప్రైవేటైజేషన్లు, గోల్డెన్ షేకులు, స్వచ్ఛంద పదవీ విరమణలూ తెస్తున్న తరుణంలో అడపా, దడపా వెలుగుచూస్తున్న ప్రభుత్వోద్యోగవకాశాలు నాలాంటి సాధారణ డిగ్రీ వాళ్లకో సదవకాశం. వాస్తవాన్ని మనస్సు ఆలోచిస్తున్నా, అంతరంగం అంగీకరించడం లేదు. ఈ అంతర్మథనంలోనే ముప్పయి నిమిషాలు ముందుకదిలాయిగానీ కలం ఒక్క అక్షరం కూడా రాయడం లేదు. అమ్మ మాటలు,చూపులు కళ్ల ముందు ప్రత్యక్షమవడంతో మనస్సాక్షిని మూలకి నెట్టి, పరీక్షరాయడం మొదలుపెట్టాను.

అంతలో... పక్క గది నుంచి అరుపులు కేకలు పెద్దగా వినిపిస్తున్నాయి. అందరూ నివ్వెరబోయి తల ఎత్తడంతో ఓ పదిహేను మంది గుంపుగా మేమున్న చోటికి వచ్చి పేపర్లు లాక్కుని విసిరికొడుతూ, ''లేవండి! ఎగ్జామ్ ఎవ్వరూ రాయకండి. పేపరు ముందే లీకయ్యింది''

# చక్ దే ఇండియా-2



ధూమ్-1, ధూమ్-2 బాటలోనే 'చక్ దే ఇండియా' మరో భాగాన్ని నిర్మించడానికి సన్నాహాలు మొదలయ్యాయి. షారూఖ్ నటించిన 'చక్ దే ఇండియా' ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ చిత్రం సాధించిన విజయాన్ని చూసిన తరువాత 'చక్ దే ఇండియా-2' తీయాలన్న ఆలోచన షారూఖ్‌ఖాన్‌కి వచ్చిందట. వెంటనే తన మనసులోని మాటను దర్శక నిర్మాతల దగ్గర బయటపెట్టాడు. ఆలోచన వచ్చిన వెంటనే హీరోయిన్ కూడా దాదాపుగా ఖరారైపోయింది. రాణీముఖర్జీ ఇందులో నటించడానికి దాదాపుగా ఖరారైపోయింది. రెండవ సినిమాలో కథ అంతా ఒక అమ్మాయి చుట్టూ తిరుగుతుంది. వచ్చే సంవత్సరం మధ్యలో దీని షూటింగ్ ప్రారంభించవచ్చని అంటున్నారు. షారూఖ్‌ఖాన్ వుమెన్ హాకీ జట్టులోని ఒక అమ్మాయిని పెళ్లి చేసుకోవడంతో రెండవ భాగం మొదలవుతుంది. మొత్తం కథ అంతా వుమెన్ హాకీ చుట్టూనే తిరుగుతుంది అంటున్నారు.

అంటూ విద్యార్థి సంఘాలు అందర్నీ బయటకు పంపుతున్నాయి. అడ్డొచ్చిన ఇన్విజిలేటర్ని పక్కకు నెట్టారు. కాపలా వున్న పోలీసుల్ని సైతం లెక్కచెయ్యకుండా అందర్నీ బయటకు పంపుతుంటే వాళ్లందరితో పాటు నేనూ పేపర్ చింపేసి, బయటకు నడిచాను.

ఎగ్జామ్ సెంటర్ ముందు ఆవేశపు వేడి చల్లారేవరకు, విద్యార్థి సంఘాలు అరుపు కేకలు నినాదాలు..

సాయంత్రం అయ్యింది. ఇంటికి రావాలని పించలేదు. కాళ్లు భాస్కర్రావంకుల్ ఇంటి వైపు అడుగులేశాయి. అక్కడ మీ స్కూటర్ కనిపించింది. ఆశ్చర్యం! మీకు, అంకుల్‌కి పేపర్ లీకయిన విషయం చెబుదామని ఆత్రంగా లోపలికొచ్చి కాలింగ్‌బెల్ నొక్కబోయిన నాచేతిని, లోపల్నుంచి మీరు, అంకుల్ మాట్లాడుకుంటున్న మాటలు ఠక్కున ఆగిపోయేలా చేశాయి.

''చూడరా! భాస్కర్! ముప్ఫయి అయిదేళ్ల నా సర్వీసులో ఎంతో మందికి రిక్రూట్‌మెంటు ఆర్డర్లు పంపాను. మనస్సాక్షిని నమ్ముకున్న నేను, ఏనాడూ దాన్ని అమ్ముకోలేదు. ఇప్పుడు నా రెండో కొడుకు సూర్యం సెటిల్ అవ్వాలన్న కారణం ఓ పక్క, నీ ప్రోద్బలం మరో పక్క.... నా ప్రిన్సిపుల్స్‌కి విరుద్ధంగా నువ్వు చెప్పినట్లు ఈ క్వశ్చన్ పేపరు కొనాల్సి వచ్చింది. ఎందుకో తెలుసా? మిగతా పిల్లలిద్దరి ముందు వీడు కూడా తలెత్తుకొని తిరగాలని, ఆర్నెల్లలో రిటైర వ్వబోయే లోపలే వీడూ సెటిలవ్వాలని'' అంటూ తప్పు చేసినట్లు మీరు అంకుల్‌తో అంటుంటే... దానికి-

''ఆపరా! నీ చాదస్తం, సిన్సియర్‌గా ఇన్నేళ్లు ఉద్యోగం చేసి నువ్వు కూడబెట్టిందేముందిరా? ఏదో నీ అదృష్టం బాగుండి పై పిల్లలిద్దరూ వృద్ధిలోకొచ్చారు. వీడు చదువులో కాస్త వెనకబడ్డాడు కాబట్టి చెయ్యందించి సెటిల్ చెయ్యాల్సిన బాధ్యత నీదేనని మరిచిపోకు. లోకంలో ఎవ్వరూ చెయ్యని నేరం చేస్తున్నట్లు ఫీలవుతావేరా!'' అని అంకుల్ అంటుంటే అడ్డొచ్చి...

''నువ్వెన్నైనా చెప్పరా! నా దృష్టిలో తెలియక చేసినా, తెలిసి చేసినా తప్పు తప్పే. మనం చేసిన తప్పులకి కారణాలు వెతుక్కుని, ఒప్పులనే అనుకుంటూ మనస్సాక్షిని సంతృప్తి పెడతాం. నా భావాల ప్రభావం పై పిల్లలిద్దరి కంటే సూర్యం మీదే ఎక్కువగా వుంది. వాడికి ఈ విషయం ఎట్టి పరిస్థితుల్లోనూ తెలియనివ్వకు. ఇవిగో... క్వశ్చన్ పేపరు కోసం నువ్విచ్చిన డబ్బులు'' అని మీరు అంకుల్‌కి డబ్బులివ్వడం కళ్లారా చూశాను.

అంతే! నా కాళ్లు అక్కడ్నుంచి అశ్వవేగంతో కదిలాయి. ఇంటి వైపు అడుగులేస్తుంటే జ్ఞానోదయం అయినట్లు, ఇన్నాళ్లకి నా ఆలోచనలు సరైన మార్గాన్ని అన్వేషిస్తున్నట్టనిపించింది.

మీరాశించినట్టు ఒకవేళ ఈ పరీక్ష సక్రమంగా జరిగి, నేను పాసయి, నాకు ఉద్యోగం వచ్చినా, తప్పు చేశాననే భావన జీవితాంతం మిమ్మల్ని, నన్నూ వెంటాడుతూనే వుంటుంది. ఎందుకంటే జీవితపు విలువలకి వలువలు ఉన్నంత వరకే అవి వెలుగు చూస్తాయనే మీ అభిప్రాయాన్నే నేను ఆచరించడం అలవర్చుకున్నాను గాబట్టి. మంచికో, చెడుకో పరీక్ష పేపరు లీకయిన సంగతి అందరికీ తెలిసిపోవడంతో పరీక్ష రద్దయింది. ఇదే నా విజయానికి చిహ్నంగా భావిస్తున్నాను. అందుకే, నాకు అభిరుచి వున్న రంగంలో కాలు మోపాలని నిర్ణయించుకున్నాను. నా విజయ పథానికి తొలి పెట్టుబడిగా మీ నుంచి అలవర్చుకున్న క్రమశిక్షణ, నిజాయితీ మలి పెట్టుబడిగా చేతిలో ఉన్న డిగ్రీతో బ్యాంకులోను తీసుకొని, మరో మిత్రునితో కలిసి చిన్న పరిశ్రమ పెట్టి, నాతో బాటు మరో ఇద్దరికి ఉపాధి కల్పించబోతున్నాను.

నాకు ఆసక్తిలేని చదువుతో పోటీ పడలేక, అలవర్చుకున్న విలువల్ని అణచిపెట్టుకోలేక, కాలం వృధా చేసుకుంటూ, న్యూనతతో ఇంట్లో దోషిలా, భారంగా మారడం ఇష్టంలేక, జీవితంలో సిన్సియర్‌గా చేస్తున్న తొలి ప్రయత్నమిది. మంచిదనిపిస్తే మనస్ఫూర్తిగా ఆశీర్వదించండి. తప్పనిపిస్తే నాన్నా! నన్ను క్షమించండి.

ఇట్లు
సూర్యం

★